# న్యాయం

**★ శ్రీ రాజేంద్ర ★**

నాలుగు తరగతులు చదువుకొన్నా, ఉద్యోగం చేయడం ఇష్టంలేక, ఇంట్లోనేవుండి పొలంపనులు చూసుకొంటూ సాగాను. మాకున్నదల్లా మూడెకరాలపల్లం, రెండెకరాలమిట్ట, రెండెకరాల మామిడితోపు మాత్రమే. మా నాన్నకు మేంనలుగురు సంతానం. అందులో మా అక్కయ్యకు పెళ్ళయింది.

ఉన్న పొలంలో బాగా కృషిచేసి మంచిపంట రాబట్టేవాళ్ళం. మాకు ఇనప్పెట్టెలేదు; ఉండినా అందులో డబ్బువుంచే అవకాశంలేదు. తిండికి లోటులేకుండా బ్రతుకుతున్నాం. ఒక పెంకుటిల్లు మా తాత కట్టించిందివుంది. తెల్లగా బట్టలువేసుకొంటాం. ఒకరితో పేచీ లేకుండా మా బ్రతుకు మేంచూసుకొంటూవుంటాం!

మావాళ్లో చాలామంది ధనవంతులున్నారు. ఆ ధనవంతుల్లో మంచివారూ వున్నారు; దౌర్జన్యంచేసేవారూ వున్నారు. ఈ ధనికుల్లో (భూస్వాముల్లో) రాఘవయ్యపేరు చెబితే గజగజలాడేవాళ్లు ఎంతోమంది బీదబిక్కి వున్నారు.

మా ఊళ్లో రాఘవయ్య మాటకు అడ్డువుండదు. ఆయన వికృత చేష్టలకూ అవరోధముండదు. తన మాటకు ఎదురు తిరిగినవారిని, తన పనులకు అడ్డు వచ్చిన వారినీ నానావిధాలా హింసిస్తూవుంటాడు. ఎవరయినా ఎక్కడయినా తన చేష్టల్ని విమర్శించాడని వింటే చాలు, ఆ కబురు చెవికిసోకితేనేచాలు వాడిని రప్పించి చావబాదేవరకు వదలడు. న్యాయాన్యాయ విచక్షణతో అవసరంలేదు. రాజు తలస్తే దెబ్బలకు కొరవా మరి!

బజారులో ఏదోపనిగా వెళ్లుతున్నాను. దారిలోనే రాఘవయ్య ఇల్లు. ఆ ఇంటిలోనుంచి పెద్ద అరుపులు వినిపించాయి. బయట కొందరు నిల్చుని ఆలకిస్తున్నారు. ఏమిటని పరామర్శించాను. మా వూర్లోనే 'రంగడనే కూలీ ఒకడున్నాడు. చాలా మంచివాడని ప్రతీతి. కొంచెం స్వేచ్ఛా జీవి. సొంతపొలం అరఎకరం వుంది. దాన్ని సాగు చేసుకొంటాడు. అవసరమైనప్పుడు. వీలయినప్పుడు. తన కిష్ట మెచ్చిన వారికి కూలికి పోతాడు.

రాఘవయ్యది భారీవ్యవసాయం. ఆయన పనులకే ఒక్కొక్కమారు కొన్ని వందలమంది కూలీలు అవసరమవుతారు. వారి పనులొచ్చినప్పుడు మాలపల్లెలోని కూలీలెవ్వరూ ఇతర్ల పనులకు పోకూడదు. అలా వెళ్ళితే వాడికి తగిన శాస్తి జరిగి తీరుతుంది. రాఘవయ్య ఆ యేడు చెఱకు తోట చాలా వేశాడు. చెఱకు ఆడటానికి చాలామంది కూలీలు కావాలి. ఇంజనుతో ఆడుతారు. కూలీలు చాలక రంగణ్ణి పిలిచారు. రంగడు ఆరోజు పొరుగూరుకు వెళ్ళవలసివుంది. తన స్వంత బావమరిది పెళ్ళి జరుగుతోంది! అంచాత ఈ రోజు రావడానికి వీలుండదని చెప్పాడట. అసలు రంగడు ఏమి చెబుతున్నాడనయినా వినిపించుకోకుండా 'వచ్చి తీరాలనీ, లేకపోతే తగిన శాస్తి జరుపుతాననీ' బెదిరించాడు. కొంతసేపు మెత్తగా చెప్పాడట రంగడు. రాఘవయ్య ఆ మాటల్ని వినిపించుకోకుండా అమ్మా అక్కా అని బూతులు ప్రారంభించాడు. ఆమాటల్ని సహించలేని రంగడు- "నేను పోవాలి. రావడానికి వీలులేదు" అని వెళ్ళిపోయాడుట.

పెళ్ళినుంచి వచ్చిన తర్వాత ఇంటికి రప్పించారు రంగణ్ణి. తలుపు తోసుకొని, లోగావెళ్ళాను. ఇంటి వరండాలో రంగణ్ణి చేతులు విరిచి, లావాటి తాడుతో ఒకస్తంభానికి కట్టివేసివున్నారు. రాఘవయ్య, రంగణ్ణి చావమోదుతున్నాడు. శరీరమంతా వాతలు ఏర్పడివుంది. "ఇంకయినా చెప్పు" అంటున్నాడు రాఘవయ్య. రంగడు జవాబు చెప్పడంలేదు

కళ్లు మూసుకొని నిశ్చలంగా వున్నాడు. ఆ నిశ్చలత్వాన్ని చూసి మరీ రెచ్చిపోయాడు రాఘవయ్య. మంచిలావాటి కర్ర పుచ్చుకొని నాలుగు బాదాడు అరుస్తూ. రంగడిలో ఏమాత్రం చలనంలేదు. రెండు మూలుగులు మూలిగాడు. కళ్ళ వెంబడి నీళ్ళు జారింది. నోటికొచ్చినట్లల్లా తిడుతూ, కొడుతూవున్నాడు రాఘవయ్యా, అతని కొడుకు చంద్రయ్యా!

"ఏమిటిది" అన్నాను. చంద్రయ్యతో "వీడు ఈ వెధవ మొన్న పనికి పిలిస్తేరాలేదు వీడి ఇష్టంగా ఆడుతున్నాడు. మొన్న ఎలెక్షన్లలోకూడా చాలా ఓట్లు-చీల్చేడు. వీడూ ఒక లీడరయిపోయాడు_ ముండాకొడుకు" అంటూ మళ్ళీ రంగడి చెంపమీద కర్రతో పొడిచాడు.

"అది వాడి స్వేచ్ఛ. కూలికిరాకపోవడానికి వాడికి వీలుండకపోవచ్చు; లేదా అవసరంలేకపోవచ్చు. కూలికిపోవడం వాడి ఇష్టంమీదా, అవసరంమీదా ఆధారపడివుంటుంది. దాన్ని అడగడానికి నువ్వెవరు? నువ్వేం అప్పుసప్పుఇచ్చి పోషిస్తున్నావా వాడిని. కరువులో కాపాడావా. కష్టాల్లో ఆదుకొన్నావా? ఇక ఎలెక్షను — అసలు ఈ ఎలెక్షను జరుగుతున్నదే ప్రజల నిర్ణయాన్ని, అభిప్రాయాన్నీ తెలుసుకోడానికి. అటువంటప్పుడు వారికి అడ్డు చెప్పడానికి మనమెవరం" అన్నాను కాస్త గట్టిగానే. "వీడెవడు మధ్యవెధవ. వీడిని తన్నరా, మొదట! వీణ్ణి గేటుకవతలతొయ్యరా ముందు — ఎవర్రా నువ్వు" అంటూ మీదికొచ్చాడు పదిమందిలో రాఘవయ్య

"అన్యాయం వద్దు" అన్నాను.

"ఎవరిది అన్యాయం, నీదా, నాదా! నామనిషిని నేనేమయినా చేసుకుంటాను. మధ్యనునీవెవరు_" కోన్‌కిస్కా_ అని గర్జించాడు రాఘవయ్య:

"నీమనిషేమిటి? ఒకవ్యక్తిమీద నీకెవరిచ్చారీ అధికారం. నువ్వేం ఒక గవర్నమెంటు ఆఫీసరువా!" అన్నాను. రంగడు కళ్లు తెరిచి చూచాడు. రాఘవయ్య నా చెంప ఛెళ్లుమనిపించి మెడపట్టి గెంటాడు వెలుపలికి. 'కళ్ళనీళ్ళతో, తలవంచుకొని వచ్చేశాను, ప్రపంచంలో న్యాయాన్యాయాల స్థానాలు ఇలా ఉన్నాయ్' అనుకొంటూ.




నేవాడుడు

శ్రీ పాదకృష్ణమూర్తిశాస్త్రి అండ్ సన్స్
రాజమండ్రి

స్త్రీ లరోగ నివారిణి

| | |
|---|---|
| ఋతుశూల | హిస్టీరియా |
| మైల సరిగా కాకుండుట | శరీరము లావుబారుట |
| మైల అధికముగ వెడలుట | ఆయాసము |
| సంతానము లేకుండుట | తిమ్మిర్లు |
| శ్వేత ప్రదరము | అజీర్ణము |
| రక్త ప్రదరము | ఆకలి సరిగా లేకపోవుట |

మొదలగువానికి వరప్రసాదిని

తులం 1 కి రు. 4-0-0

★

Or 10 గణపతి మొదలివీధి,
రాయపేట, మద్రాసు-14